www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 18 జూలై 2023

5

అన్నమయ్య



పిల్లల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వద్దు



చిన్నారులను పరీక్షిస్తున్న డాక్టర్ రమేష్‌రెడ్డి

ప్రజాశక్తి-పీలేరు

పిల్లల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యం ఉండరాదని డాక్టర్ రమేష్‌బాబు అన్నారు. సోమవారం ఆయన మేళ్లచెరువు అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశంసలు పిల్లల్లో మంచి పనులు చేసేలా ప్రోత్సహించాలని తెలిపారు. బంగారు బాల్యానికి మెరుగులు దిద్దుతూ వారి వ్యక్తిత్వ వికాసానికి కృషి చేయాలన్నారు. ముఖ్యంగా పిల్లలకు చేతులు శుభ్రత, వ్యక్తిగత శుభ్రత, స్నేహితులతో మాట్లాడే తీరు, క్రమశిక్షణ, పెద్దలను గౌరవించడం, మంచి ఆహార అలవాట్లు, సమయపాలన, మొదలగు అంశాలను అలవర్చాలని సూచించారు. బాల్యాన్ని నిర్లక్ష్యం చేస్తే పిల్లల్లో గ్రహణ శక్తి, జ్ఞాపకశక్తి తగ్గడం, చదువుమీద శ్రద్ధ మందగించడం, మొదలగు నష్టాలు దారి తీసే ప్రమాదం ఉందని చెప్పారు. కార్యక్రమంలో పిహెచ్‌ఎన్ ఆదిలక్ష్మి, ఎఎన్ఎం నాగవేణి, సిహెచ్ఒ కుముద, అంగన్వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి

- ధర్నాలో సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు



నిరసన తెలుపుతున్న ప్రజలు, సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

రాజకీయ నాయకులు గడప గడపకూ కార్యక్రమంటూ ప్రచారం నిర్వహించుకోవడం కాదనీ, ప్రజా సమస్యలు పరిష్కారంపై చొరవ చూపాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. పట్టణంలోని మహబూబ్ నగర్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. మురుగునీరు కాలువలు నిర్వహించాలని, తాగునీటి సమస్య పరిష్కరించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పి.శ్రీనివాసులు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం గడప గడపకూ మన ప్రభుత్వం పేరుతో అధికారులందరినీ వెంట వేసుకొని రాజకీయ ప్రచారం చేసుకుంటుంది తప్ప ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలో మౌలిక సదుపాయాలు లేకపోవడం పట్ల ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి సిగ్గుపడాలని పేర్కొన్నారు. పట్టణ నడిబొడ్డున ఉన్న మహబూబ్ నగర్‌లో రమీజా మజీద్ చుట్టుపక్కల ప్రాంతాల్లో మురుగు నీరు వెళ్లడానికి మార్గము లేకపోవడం కారణంగా ఉన్న మురుగునీటి కాలువల్లో పేరుకుపోయి, కొద్దిపాటి వర్షం వచ్చినా, ఇళ్లల్లోకి మురుగునీరు వచ్చేసే దుస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మురుగునీటిని ప్రతిరోజు తోడి బయట పోసుకోవాల్సిన పరిస్థితి పేద ప్రజలకు ఉండడం పట్ల అధికార పార్టీ నాయకులు స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. సిపిఎం తరఫున ఆ ప్రాంతంలో పర్యటించిన సందర్భంగా కౌన్సిలర్ ఎవరో తెలియదని చెబుతున్నారంటే నాయకులకు ఓట్లు కోసం కాంట్రాక్టర్లకు లాభాలు చేకూర్చడం తప్ప ప్రజల సమస్యలు కనపడలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలను పట్టించుకోని పాలకులకు ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. జిల్లా కేంద్రం అభివృద్ధి పట్ల స్థానిక శాసనసభ్యులకు ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా పట్టణంలో మురికి నీటి కాలువలు, రోడ్లు, నిర్మించాలని తాగునీటి సమస్య పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. స్పందించిన కమిషనర్ మహబూబ్‌నగర్ ప్రాంతంలో పర్యటించి సమస్యల పరిష్కారానికై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీ వాసులు జాబిరున్నీష, మెహరున్నీష, చాన్ బీ, బావా ఫక్రుద్దీన్, మహబూబ్‌నగర్ ప్రజలు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లల నమోదుపై ప్రత్యేక శ్రద్ధ

- పాఠశాలల తనిఖీలో కలెక్టర్ గిరీష



జడ్‌పి పాఠశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి-గుర్రంకొండ

బడి ఈడు పిల్లల నమోదుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి సర్వే త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ గిరీష విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం మండలంలోని జిల్లా పరిషత్ ఉర్దూ హైస్కూల్‌ను తనిఖీ చేశారు. చైల్డ్ ఇన్ఫో అడ్మిషన్ ప్రోగ్రాం పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ సర్వేకి సంబంధించి ఇంటర్మీడియట్‌లో విద్యార్థులు ఎంతమంది అడ్మిషన్ పొందారు, ఇంటర్ ఫెయిలైన తిరిగి కళాశాలలో చేరిన విద్యార్థులు ఎంతమంది తదితర వివరాలపై కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన ప్రతి విద్యార్థి కళాశాలలో చైల్డ్ ఇన్ఫో అడ్మిషన్ పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కళాశాలలో చేరిన ప్రతి విద్యార్థి చైల్డ్ ఇన్ఫోలో నమోదు కావాలన్నారు. గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ సర్వేలో వాలంటీర్ ఏవిధంగా లాగిన్ అయి నమోదు చేస్తున్నాడన్న అంశాలపై కలెక్టర్ ఆరా తీస్తూ కొంత మంది విద్యార్థుల డేటాను ఓపెన్ చేసి పరిశీలించారు. 5 నుండి 18 సంవత్సరాల్లోపు బడి బయట ఉన్న పిల్లలందరూ గ్రాస్ ఎన్రోల్మెంట్ సర్వేలో కచ్చితంగా నమోదై పాఠశాలల్లో చేరే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను ఇంటర్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్ చేసి చైల్డ్ ఇన్ఫో డాట్ కాంలో ఎన్‌రోల్ చేయాలన్నారు. ప్రభుత్వం పది పాసైన ప్రతి విద్యార్థి ఇంటర్‌లో ప్రవేశం పొందేల చర్యలు తీసుకుంటుందన్నారు. పదో తరగతి ఉత్తీర్ణతులై ఇంటర్ మొదటి సంవత్సరానికి చాలా మంది విద్యార్థులు జాయిన్ కావడం లేదని కళాశాల ప్రిన్సిపాళ్లు, విద్యాశాఖ అధికారులు అడ్మిషన్ల ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలన్నారు. జాయినైన విద్యార్థుల వివరాలను తప్పక చైల్డ్ ఇన్ఫో డాట్ కాంలో నమోదు చేయాలన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశం పూర్తయిన తర్వాత ఇంకా మిగిలి ఉన్న విద్యార్థుల మీద దృష్టి పెట్టి వారి తల్లిదండ్రులతో మాట్లాడి కళాశాలలో విద్యార్థులు చేరే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో డిఇఒ పురుషోత్తం, ల్యాండ్ అండ్ సర్వే ఎడి జయరాజ్, ఎంఇఒ సురేంద్రబాబు, తహశీల్దార్ ఖాజాభి, ఎంపిడిఒ వెంకటేశులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కురబలు ఐకమత్యంగా ఉండాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కురబలు ఐకమత్యంగా ఉండాలని, కలసి కట్టుగా పోరాడి రాజ్యాధికారం సాధించుకోవాలని మదనపల్లె, తంబళ్లపల్లె కురబ సంఘం అధ్యక్షులు కప్పల రాజన్న, గుడే శ్రీనివాసులు తెలిపారు. సోమవారం మదనపల్లె ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆరేళ్లుగా కురబ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జబ్బల శ్రీనివాసులు నేతృత్వంలో కురబకుల సంక్షేమానికి ఎన్నో కార్యక్రమాలు నిర్వహించామని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా కనకదాసు జయంతి ఉత్సవ ముగింపు సభను నిర్విహించామని గుర్తు చేశారు. కురబలను ఎస్టీలో చేర్చాలనే డిమాండ్‌తో డిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన కార్యక్రమాలు చేశామని వెల్లడించారు. జబ్బల శ్రీనివాసులు ఆధ్వర్యంలో కురబకులానికి మంచి జరుగుందని తమకు నమ్మకం ఉందన్నారు. కొందరు కురబలను విడదీసే విధంగా కొత్త సంఘం ఏర్పాటు చేసినట్లు తమకు తెలిసిందని దీనివల్ల అందరం నష్టపోవలసి వస్తుందని విమర్శించారు. అందరూ కలసి కట్టుగా పోరాడితేనే ఏదైనా సాధ్యం అవుతుందని ఆదిశగా అందరూ ఆలోచన చేయాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో కురబలకు చట్టసభల్లో ప్రాముఖ్యత కల్పించేవిధంగా పోరాటం చేయడానికి కలసి రావాలని కోరారు. కులం అనేది ఒక కుటుంబం లాంటిదని దానిలో తప్పు ఒప్పులు ఉంటే కూర్చుని సరిదిద్దుకోవాలే తప్ప విడిపోకూడదన్నారు. సమావేశంలో గుడి రామాంజులు, రాజ్ కుమార్, వెంకట రమణ, భగవాన్ పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులను పరిష్కరించండి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

స్పందన కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులపై తగిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజ, పురపాలిక కమిషనర్ కె.ప్రమీల తెలిపారు. సోమవారం పురపాలిక కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో ప్రజలు తీసుకొచ్చిన అర్జీలను తీసుకున్నారు. మొత్తం నాలుగు సమస్యలు వచ్చాయన్నారు. ఆర్ఆర్‌నాయుడులో నివాసమున్న కె.మనోహర్‌రెడ్డి ఇంటి ముందున్న కాలువలో ఇసుక, మురుగు నీరు తొలగించాలని, బి.కె.పల్లెలో కె.సుబ్రమణ్యం, న్యూ విద్యా కాలనీలో కుక్క బెడద ఎక్కువగా వునదని స్థానికులు వినతులు ఇచ్చారని చెప్పారు. ఫిర్యాదులపై సంబంధిత అధికారులకు వెంటనే పరిష్కార నిమిత్తం అదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పురపాలక సంఘం అన్ని శాఖాధిపతులు పాల్గొన్నారు.

రైళ్ల నిలుపుదల కోరుతూ 'బత్యాల' లేఖ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాజంపేట, రైల్వేకోడూరు, నందలూరులో రైళ్లు ఆపాలని కోరుతూ సోమవారం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్యాల చంగల్రాయుడు రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్, గుంతకల్ డివిజన్ మేనేజర్ కె.వెంకట రమణారెడ్డికి లేఖ రాశారు. ఈ సందర్భంగా బత్యాల మాట్లాడుతూ చెన్నై ఎగ్మోర్ ఎస్ఎఫ్ ఎక్స్‌ప్రెస్, హరిప్రియ ఎక్స్‌ప్రెస్, కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్‌లతో పాటు ప్రధాన నగరాలకు వెళ్లేందుకు కొన్ని ప్రత్యేక రైళ్లు రాజంపేట, రైల్వేకోడూరు, నందలూరులలో ఆపేవారని తెలిపారు. కోవిడ్ సమయంలో రైళ్లు స్టాపింగ్ తీసివేశారన్నారు. రైల్వేకోడూరు ఉద్యాన పంటలకు పెట్టింది పేరని, రైళ్లు నిలుపుదల లేకపోవడంతో రైతులు తమ పంటను ఎగుమతి చేసుకునేందుకు వీలు లేక అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. నందలూరు రైల్వే కేంద్రంగా సౌమ్యనాథ స్వామి ఆలయం, ఒంటిమిట్ట కోదండ రామాలయానికి పర్యాటకులు విరివిగా వస్తుంటారని తెలిపారు. రాజంపేట డివిజన్ కేంద్రం కాబట్టి పలు రకాల కార్యకలాపాలపైన ప్రయాణికులు వస్తుంటారని తెలిపారు. రైతులు, భక్తులు, పర్యాటకులు, ప్రజల సౌకర్యార్థం తిరిగి రైళ్లు పునరుద్ధరించాలని కోరారు.

మెగా డిఎస్‌సి విడుదల చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం 25 వేల పోస్టులతో మెగా డిఎస్సీ విడుదల చేయాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య జిల్లా కార్యదర్శి వీరణాల.శివకుమార్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు సంవత్సరాలు అవుతున్నా ఇంత వరకు ఒక్క డిఎస్‌సి కూడా నిర్వహించని పరిస్థితిలో ఉందన్నారు.ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి తన పాదయాత్రలో ఏటా డిఎస్‌సి నిర్వహిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక నిరుద్యోగులకు పంగనామాలు పెట్టారని విమర్శించారు. విద్యా శాఖా మంత్రి బొత్స సత్యనారాయణ కనీస అవగాహన లేకుండా టీచర్ పోస్టులు ఖాళీలు గురించి మాట్లాడుతున్నారన్నారు. ఆగస్ట్ లో 700 పోస్టులలో డిఎస్‌సి నిర్వహిస్తామని చెబుతున్నారని, ఇది దారుణమన్నారు. మంత్రి పొంతనలేని లెక్కలతో నిరుద్యోగులను అయోమయానికి గురి చేస్తున్నారని విమర్శించారు. ఒక వైపు నిరుద్యోగులు డిఎస్‌సి ఏర్పాటు కోసం సంవత్సరాల కొద్ది కోచింగ్ సెంటర్‌లలో శిక్షణా తీసుకుంటూ వయోభారంతో అల్లాడిపోతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా ఆలోచించి 25వేల పోస్టులతో మెగా డిఎస్‌సి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నగర అధ్యక్షులు షాకీర్ పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ భూములు ఇవ్వాలంటూ దళితుల

రాస్తారోకో

రోడ్డుపై బైఠాయించిన దళిత కాలనీ వాసులు
ఆందోళనకారులను చెదరగొట్టిన పోలీసులు
తోపులాటలో సొమ్మసిల్లిన మహిళ
గంటపాటు నిలిచిన వాహనాల రాకపోకలు



రోడ్డుపై టైర్లు, ముళ్ల కంప వేసి నిరసన తెలియజేస్తున్న ఆందోళనకారులు

బద్వేలు : జగనన్న స్మార్ట్ సిటీ కోసం అధికారు లు దళితుల భూములను తీసుకున్నారు. ఇంత వరకూ ఎలాంటి నష్ట పరి హారం, ప్రత్యామ్నాయం చూప కపోగా పనులు ప్రారంభిస్తుండడంతో బాధితులు రోడ్డెక్కారు. జాతీయ రహదారిపై టైర్లు, కంచెలు వేసి బైఠాయించారు. తమకు ప్రత్యామ్నాం చూపకుండా ఎలా పనులు మొదలు పెడతారంటూ అధికారులను నిలదీశారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి వారిని చెదగొట్టే ప్రయత్నం చేయగా దళితులు, మహిళలు వారిని వారించారు. ఆందోళన కారులకు, పోలీసులకు వాగ్వివాదం చోటుచేసుకుంది. తోపులాటలో ఓ మహిళ సొమ్ముసిల్లి పోవడంతో స్థానికులు ఆమెను 108 వాహనంలో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వివరాలు... జగనన్న స్మార్ట్ సిటీ కోసం గోపవరంలోని సర్వేనంబర్ 1751 నుంచి 1761 వరకు జెడ్‌హెచ్‌డిసి



ఆందోళనకారుల్ని చెదరగొడుతున్న పోలీసులు

కింద గతంలో ప్రభుత్వం 28 మంది లబ్ధిదారులకు 68 ఎకరాలను ఇచ్చింది. ప్రస్తుతం ప్రభుత్వం జగనన్న స్మార్ట్ సిటీ కోసం దళితుల నుంచి సేకరించారు. అందులో 35 ఎకరాల్లో వెంచర్ వేసేందుకు సోమవారం పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు చేశారు. విషయం తెలుసుకున్న మడకవారిపల్లె దళితులు నెల్లూరు జాతీయ రహదారి 67 పైకి వచ్చి ఆందోళన చేపట్టారు. కంప మొక్కలు, టైర్లు రోడ్డుకు అడ్డుగా పెట్టి రాస్తారోకో నిర్వహించారు. సుమారు కిలో మీటర్ మేర వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం కల్గింది. బద్వేల్ రూరల్ పోలీసులు రంగప్రవేశం చేసి ఆందోళన కారులను చెరదగొట్టే ప్రయత్నం చేశారు. ఈనేపథ్యంలో మహిళలకు, పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. తోపులాటలో ఓ మహిళ సొమ్ముసిల్లి పోవడంతో స్థానికులు ఆమెను 108 వాహనంలో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రూరల్ సిఐ హనుమంతనాయక్, ఎస్ఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు బలవంతంగా చెదరగొట్టి కొంత మందిని అరెస్టు చేశారు. వామపక్ష నాయకులు ఆందోళనకారులకు సంఘీభావంగా నిలిచి నిరసన తెలియజేశారు. అనంతరం సిఐ, ఎస్ఐ మాట్లాడుతూ ఏదైనా సమస్య ఉంటే ఆర్‌డిఒకు విన్నవించుకోవాలని చెప్పడంతో వారు సద్దుమనిగారు.



నిరసన తెలుపుతున్న వాల్మీకులు

వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఇచ్చిన మాట ప్రకారం వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని వాల్మీకి సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు పులి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. వాల్మీకి సంఘం నిర్వహించిన చలో విజయవాడ విజయవంతనికి సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్క వాల్మీకికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర ఉద్యమం తరహా ఉద్యమాలు ఆంధ్రప్రదేశ్‌లోని వాల్మీకులు 66 ఏళ్లుగా పోరాటాలు ఉద్యమాలు చేస్తూ వస్తున్నామని తెలిపారు. రవి అస్తమించని బ్రిటిష్ వారిని సైతం భారతదేశం నుండి తరిమి భారతదేశానికి స్వేచ్ఛ కోసం స్వాతంత్ర ఉద్యమాలలో పాల్గొని ఎంతోమంది వాల్మీకులు అమరులై దేశానికి స్వేచ్ఛ సమానత్వం, స్వాతంత్రాలను తేవడంలో ప్రధాన పాత్ర వాల్మీకులు పోషించారని పేర్కొన్నారు. వాల్మీకులకు అన్యాయం చేసిన నేతలు, పార్టీలు ఏమైనాయో ఒక్కసారి చరిత్రను గుర్తు చేసుకోవాలన్నారు. వాల్మీకులకు ఇప్పటికైనా భారత దేశ వాల్మీకులతో సరిసమానంగా ఆంధ్రప్రదేశ్‌లోని ఎనిమిది జిల్లాలలోనీ వాల్మీకులకు ఎస్టీ పునరుద్ధరణ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాబోయే రోజులలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో సద్దల జయసింహ, కృష్ణమూర్తి, సద్దల నరసింహులు, కాంతమ్మ, గంగులమ్మ, రమణమ్మ, ప్రత్యూష పాల్గొన్నారు.

పంచాయతీ నిధులను కాజేయడం దుర్మార్గం

- సర్పంచుల సంఘం కడప జిల్లా నాయకుల హెచ్చరిక

ప్రజాశక్తి - కడప అర్బన్

పంచాయతీ నిధులను దారి మళ్ళించిన వైసిపి ప్రభుత్వ తీరుకు నిరసనగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇంటిని ముట్టడిస్తామని ఏపీ సర్పంచుల సంఘం, పంచాయతీరాజ్ ఛాంబర్ ఉపాధ్యక్షులు మునిరెడ్డి, కొండయ్య హెచ్చరించారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 14,15వ ఆర్థిక సంఘం నిధులు కింద రూ.8,660 కోట్లు విడుదల చేసిందని తెలిపారు. ఈ నిధులను రాష్ట్ర ప్రభుత్వం పక్కదారి పట్టించిందని పేర్కొన్నారు. సర్పంచుల చెక్కులపై సంతకాలు, అనుమతి, గ్రామపంచాయతీల తీర్మానాలు, గ్రామసభల తీర్మానాలు లేకుండా, సర్పంచ్లకు చెప్పకుండా నిధులను రాష్ట్ర ప్రభుత్వం దొంగలించిందని తెలిపారు. నిధులు లేక గ్రామాలలో రోడ్లు, తాగునీరు, పారిశుధ్య పనులు చేయలేక సర్పంచులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై రాష్ట్ర పంచాయతీరాజ్ ముఖ్య కార్యదర్శిని, పంచాయతీరాజ్ శాఖ కమిషనర్‌ను స్వయంగా కలిసి వినతిపత్రం ఇచ్చినా ఏమాత్రం ప్రయోజనం లేదన్నారు. 12, 9 1 8 గ్రామ పంచాయతీలు రాష్ట్రంలో జీరో బ్యాలెన్స్ లో నడుస్తున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్ననిధులను వెంటనే వెనక్కి ఇవ్వాలని లేనిపక్షంలో ఆందోళన పోరాటాలకు శ్రీకారం చెబుతామని హెచ్చరించారు. సమావేశంలో పలువురు సర్పంచులు పాల్గొన్నారు.

బాలికల వసతి గృహంలో వీధిదీపాలు ఏర్పాటు

ప్రజాశక్తి-పీలేరు

చీకట్లో పాముల భయంతో బిక్కుబిక్కుమంటూ రాత్రిళ్లను వెళ్ళదీస్తూన్న విద్యార్థినులకు పీలేరు సర్పంచ్ డాక్టర్ షేక్ హబీబ్ బాష మానసిక, భౌతిక ధైర్యాన్నిచ్చారు. పీలేరు పట్టణ శివారులోని తిరుపతి రోడ్డులో ఉన్న ఎపి గురుకుల బాలికల ఆశ్రమ పాఠశాలలో సుమారు 250 మందికి పైగా విద్యార్థినులున్నారు. వారు ఉంటున్న ఆశ్రమ పాఠశాల ప్రాంగణం విశాలంగా, చెట్లు, గుట్టలతో నిండి ఉండడంతో పాముల బెడద అధికమైంది. విద్యార్థులు రాత్రిళ్లలో ప్రాంగణంలో అడుగు పెట్టాలంటేనే భయపడే పరిస్థితులు ఎక్కడున్నాయి. విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచ్ హబీబ్ బాష సోమవారం తన సిబ్బందితో కలిసి గురుకుల పాఠశాలను సందర్శించారు. అక్కడి విద్యార్థినుల ఇబ్బందులను అర్థం చేసుకుని ఆ వెంటనే స్పందించారు. ప్రాంగణంలో చెట్లకు 10 వీధి దీపాలను ఏర్పాటు చేయించి పిల్లల్లో మానసిక, భౌతిక స్థైర్యాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



గురుకుల పాఠశాలకు వీధిదీపాలు సమకూర్చిన సర్పంచ్ హబీబ్

నెల్లూరుపై కర్నూలు జట్టు విజయం







తలపడుతున్న కడప, చిత్తూరు జట్లు

ప్రజాశక్తి - కడప

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎసిఎ సౌత్ జోన్ అండర్-19 మల్టీడే క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా కెఒఆర్ఎంక్రికెట్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో నెల్లూరు జట్టుపై 239 పరుగుల తేడాతో కర్నూలు జట్టు ఘనవిజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్స్‌లో కర్నూలు జట్టు 395 పరుగులు చేసింది. నెల్లూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 259 పరుగులు చేసింది. 8 వికెట్ల నష్టానికి 140 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో చివరి రోజు రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన కర్నూలు జట్టు 38.3 ఓవర్లలో 146 పరుగులకు ఆలౌట్ అయింది. కర్నూలు జట్టు 281 పరుగుల విజయ లక్ష్యాన్ని నెల్లూరు జట్టు ముందు ఉంచింది. రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన నెల్లూరు జట్టు 15.3 ఓవర్లలో 43 పరు గులకే ఆలౌట్ అయి ఓటమి చెందింది. కర్నూలు జట్టులోని బౌలర్ డి.అక్షిత్‌రెడ్డి అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించాడు. 8 ఓవర్లు బౌలింగ్ చేసి మూడు మేడిన్ వేసి 22 పరుగులు ఇచ్చి 6 వికెట్లు తీసుకోవడం విశేషం.

డ్రాగా ముగిసిన కడప చిత్తూరు జట్ల మ్యాచ్

కడప, చిత్తూరు జట్ల మధ్య నిర్వహించిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఈ మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్స్‌లో చిత్తూరు జట్టు 279 పరుగులు చేసింది. 7 వికెట్ల నష్టానికి 383 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో చివరి రోజు బ్యాటింగ్ ప్రారంభించిన కడప జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 104.4 ఓవర్లలో 438 పరుగులకు ఆల్ అవుట్ అయింది. ఆ జట్టులోని రోహిత్ వర్మ 64, ప్రణవ్ రెడ్డి 78, ప్రనిల్ రెడ్డి 74 పరుగులు చేశారు. చిత్తూరు జట్టులోని డి. బాలాజీ 4 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన చిత్తూరు జట్టు చివరి రోజు ఆట ముగిసే సమయానికి 77.0 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 241 పరుగులు చేసింది. ఆ జట్టులోని గౌతమ్ కృష్ణ తేజ రెడ్డి 78 (నాట్ అవుట్), జెనిక్ దాస్ 65 పరుగులు చేశారు. కడప జట్టులోని సాయి అర్జిత్ రెడ్డి 2 రెండు వికెట్లు తీసుకున్నాడు. మ్యాచ్ డ్రాగా ముగిసింది. మొదటి ఇన్నింగ్స్ లో కడప జట్టు ఆధిక్యత సాధించింది.

వేగవంతంగా అర్జీల పరిష్కారం

ప్రజాశక్తి - రాయచోటి

ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం జగనన్నకు చెబుదాం - స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలని కలెక్టర్ గిరీష పి.ఎస్. అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ తోపాటు జెసి ఫర్మన్ అహ్మద్, డిఆర్ఒ సత్యనారాయణ ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు ఫిర్యాదులను తప్పనిసరిగా పరిష్కరించాలని ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తులు, బియాండ్ ఎస్ఎల్ఎ, రీఓపెనింగ్ లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. జిల్లాలో క్షేత్రస్థాయిలో జరుగుతున్న జగనన్న సురక్ష కార్యక్రమంలో అంజన్న సర్వీస్ రిక్వెస్ట్‌లకు టోకెన్ జనరేట్ చేసి ఇంకనూ పరిష్కరించని వాటిని వెంటనే పరిష్కరించాలని ఈ మేరకు జిల్లా అధికారులు ఆయా ఎంపీడీవోలతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాస్టర్ లాలో గౌతమికి గోల్డ్ మెడల్

ప్రజాశక్తి-కడప ప్రతినిధి



కడప నగరానికి చెందిన గౌతమి సంఘమిత్రకు మాస్టర్ ఆఫ్ లాలో గోల్డ్ మెడల్ లభించింది. అనంతపురం శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ సోమవారం నిర్వహించిన కాన్వగేషన్‌లో గవర్నర్ అబ్దుల్ నజీర్ గోల్డ్ మెడల్ అందజేశారు. సంఘమిత్ర తండ్రి సంపత్ కుమార్ కడప నగరంలో ప్రముఖ న్యాయవాదిగా 35 సంవత్సరాలు పని చేయడమే కాకుండా అభ్యుదయ వాదిగా పలు సేవలందిస్తున్నారు. ఆమె తల్లి మనోరమ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. గోల్డ్ మెడల పొందిన గౌతమి సంఘమిత్ర మాట్లాడుతూ నాన్న ఆదర్శంగా క్రిమినల్ లా చేసేందుకు ఎస్కెయూలో సీటు పొందానని తెలిపారు .ఇక్కడ ప్రొఫెసర్లు శ్రీరాములు, పుల్లారెడ్డి ప్రోత్సాహంతో బాగా చదివి మంచి మార్కులు సాధించి గోల్డ్ మెడల్‌కు ఎంపిక అయ్యానని పేర్కొన్నారు. ప్రస్తుతం కడపకోర్టు బార్‌లో క్రిమినల్ లాయర్ గా పనిచేస్తున్నారని తెలిపారు. గౌతమి సంఘమిత్ర మాస్టర్ లా లో గోల్డ్ మెడల్ సాధించడం పట్ల ఆమె తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.


సమావేశంలో మాట్లాడుతున్న డిపిఎంఒ డాక్టర్ లోకవర్ధన్

వంద శాతం లక్ష్యాలను సాధించాలి : డిపిఎంఒ

ప్రజాశక్తి-కలకడ

జాతీయ ఆరోగ్య కార్యక్రమాలలో వందశాతం లక్ష్యాలు సాధించాలని డిపిఎంఒ డాక్టర్ లోకవర్ధన్ అన్నారు. జాతీయ ఆరోగ్య మిషన్ కార్యక్రమ అమలు పర్యవేక్షణలో భాగంగా డాక్టర్ లోకవర్ధన్ సోమవారం మండలంలోని కలకడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆస్పత్రి దస్త్రాలు పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమావే శమై ఎన్‌సిడి, సిడి సర్వే, ఆరోగ్యశ్రీ లోని ఎఎన్‌ఎం ఫీడ్‌బ్యాక్, వెక్టార్ కంట్రోల్ హైజీన్ ఆఫ్ ఆర్‌సిహెచ్ పోర్టల్ నిర్వహణ, అనిమియా ముక్త్‌భారత్, గ్రామ పారిశుధ్య పోషణ, జన ఆరోగ్య సమితి ఖాతాల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. వంద శాతం లక్ష్య సాధనకు అనుగుణంగా పనిచేసి జిల్లాకు మంచి పేరు తేవాలని సిబ్బందికి సూచించారు. అనంతరం డ్రగ్స్ స్టోర్స్‌ను తనిఖీ చేశారు. బిన్‌కార్డ్స్‌ను పరిశీలించారు. ప్రతి సిహెచ్‌ఒ జన ఆరోగ్య సమితి ఖాతాలు యూనియన్ బ్యాంక్‌లో ఒపెన్ చేసుకుని హెల్త్ వెల్లన్స్ సెంటర్‌కు కావలసిన విధంగా మార్గదర్శకాలను పాటించాలన్నారు. కార్యక్రమంలో , వైద్యులు డాక్టర్ మల్లి కార్జున డాక్టర్ వై. మోహన్, సీనియర్ అసిస్టెంట్ సౌమ్య ,హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, రాజమ్మ ఆరోగ్య పర్యవేక్షకులు వెంకటేశ్వరరావు, రమణమ్మ, స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్ట్ పాల్గొన్నారు.

'పంచ్ ప్రభాకర్'పై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

దళితులను అవమానిస్తూ, అసభ్య పదజాలంతో దూషించిన పంచ్ ప్రభాకర్ రెడ్డి పై చర్యలు తీసుకోవాలని నిమ్మనపల్లి దళిత సంఘాల నాయకులు డిమాండ్‌చేశారు. సోమవారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద మాల మహానాడు జిల్లా అధ్యక్షులు వీరనాల మాణిక్యం, ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షులు రెడ్డినారాయణ, దళిత సంఘ నాయకులు అంజప్ప, ఎర్రప్పల ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలోని దళితులను అసభ్య పదజాలంతో, కులం పేరుతో దూషించి, అవమానించిన పంచ్ ప్రభాకర్ రెడ్డిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటి కేసు నమోదు చేసి, అరెస్టు చేసి, శిక్షించాలని డిమాండ్ చేశారు. దళితులు రాజకీయాల్లో, ఉద్యోగాల్లో ఉన్నా ఏనాడు, ఎవరి పట్ల అనుచితంగా ప్రవర్తించలేదని అన్నారు. అటువంటి వారిపై విచక్షణ కోల్పోయి, యావత్ దేశంలోని దళితులను కులం పేరుతో దూషించటం, అవమానించడం దళితులను కించపరిచేలా ఉందని అన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ దేశంలోని దళితులకే కాకుండా, బహుజనులు అందరికీ సమాన హక్కులను కల్పించారని అన్నారు. కార్యక్రమంలో ప్రజాసేవా సంస్థ అధ్యక్షులు సహదేవ, మాలమహానాడు ఉపాధ్యక్షులు సుధాకర, బాస్ మండల కన్వీనర్ చెంద్రాయుడు, జి.గంగులప్ప, శ్రీరాములు, జగదీష్, నాగరాజా పాల్గొన్నారు.


వృద్ధాశ్రమంలో భోజనం చేస్తున్న వృద్ధులతో లయన్స్‌క్లబ్ సభ్యులు

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి-రామాపురం

లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో సోమవారం బండపల్లి పంచాయతీ ప్రేమాలయంలోని వృద్ధాశ్రమంలో గాలివీడు మండలం, నూలివీడు గ్రామం, నక్కలవాండ్లపల్లి వాస్తవ్యులు సుద్దుమాళ్ళ పార్వతమ్మ రెండవ వర్ధంతి సందర్భంగా ఆమె కుమారులు వీరాంజనేయులు, మల్లికార్జున ఆర్థిక సౌజన్యంతో అన్నదానం నిర్వహించారు. దాతలు మాట్లాడుతూ మా అమ్మ పార్వతమ్మ రెండవ వర్ధంతి పురస్కరించుకుని తమ వంతుగా ప్రజలకు ఉపయోగపడే సేవ చేయాలనే సంకల్పంతో ప్రేమాలయం వృద్ధాశ్రమంలో అన్నదానం చేశామన్నారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు లయన్ షేక్ మహమ్మద్, నందిని ట్రావెల్స్ వినోద్‌కుమార్ నాయక్, ఆశ్రమం మేనేజర్ సుబ్బయ్య, సభ్యులు పాల్గొన్నారు.


జాతర నిర్వాహకులకు విరాళాన్ని అందిస్తున్న మేడా విజయశేఖర్‌రెడ్డి

మారెమ్మ జాతరకు రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ అరవపల్లిలోని శ్రీముత్తుమారెమ్మ జాతరకు సోమవారం రాజంపేట యువ నాయకుడు మేడా విజయశేఖర్‌రెడ్డి లక్ష రూపాయల విరాళాన్ని ఆలయ ధర్మకర్త సేలం వెంకటరమణకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి జాతర కోసం నా వంతు ఎంతైనా సహాయం చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వహకులు ఆయనను శాలువతో సన్మానించి అమ్మవారి ఆహ్వాన పత్రికను అందించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సేలం వెంకటరమణ, ఆలయకమిటీ మెంబర్స్ సేలం చంగల్ రాయుడు, శ్రీరామ్, కిరణ్ కుమార్, ఆర్.మణి, బి.మురళి, నాగరాజురావు, కార్యనిర్వాహకులు గ్రీస్మంత్ రెడ్డి, సుధా, పుత్తా శివశంకర్, రాము వెంకటేష్, శివ, అరిగెల హరిబాబు, అరిగెల మణి, మండెం నాగరాజు పాల్గొన్నారు.

ఉచితంగా హిందీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని టి.కమ్మపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రేమ్ చంద్ హిందీ భవన్ సొసైటీ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు ఉచితంగా హిందీ మెటీరియల్ పంపిణి కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బబిత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ముఖ్యఅతిథిగా ఎంఇఒ చక్రధర్‌రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే ఒక ప్రణాళికాబద్ధంగా పరీక్షలకు సంసిద్ధులు కావాలన్నారు. అడ్డదారుల్లో ఉత్తీర్ణత సాధించాలని ఆలోచన విరమించుకోవాలన్నారు. మార్కుల కన్నా జ్ఞానం పెంపొందించుకోవడం ముఖ్యమని అన్నారు. జాతీయ భాష హిందీతో అనేక ఉపాధి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. హిందీలో 90 పైగా మార్కులు సాధించాలని సూచించారుజ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమణారెడ్డి, సయ్యద్ సర్తాజ్ హుస్సేన్, బాల నరసింహులు, శామీర్ హుస్సేన్, గిరిధర్, హేమలత, ప్రమీల, విద్యార్థులు పాల్గొన్నారు.

మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

లక్కిరెడ్డిపల్లి : స్థానిక ఎపి మోడల్ స్కూల్‌లో 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించిన 6వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలోకి మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ కోమటిరెడ్డి శివశంకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 5 వ తరగతి పూర్తి చేసిన వారు 10వ తరగతి పాసైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చున్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 20వ తేదీలోపు పాఠశాలలో అందించాలన్నారు. పూర్తి వివరాలు కోసం పాఠశాల ప్రిన్సి పల్‌ను సంప్రదించాలన్నారు.

ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం : ఎమ్మెల్యే


మదనపల్లి : కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష ద్వారా ప్రజా సమస్యలకు సత్వరమే పరిష్కారం లభిస్తోందని ఎమ్మెల్యే నవాజ్‌బాషా పేర్కొన్నారు. సోమవారం 30వ వార్డు కౌన్సిలర్ సరితా బాలగంగాధర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రశాంత్‌నగర్‌లో నిర్వహించిన జగనన్న సురక్షా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు ఏమి అవసరమో అది గ్రహించి, అందు కోసం వినూత్న కార్యక్రమాలను తీసుకొచ్చి ప్రజలకు మేలు చేస్తున్న ఏకైక సిఎం జగన్ మాత్రమేనని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అన్నింటినీ నెరవేర్చిన ఘనత వైసిపి ప్రభుత్వాకే దక్కుతుందన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ వి.మనూజారెడ్డి మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో మునిసిఫల్ వైస్ ఛైర్మన్ నూర్‌ఆజామ్ మార్కెట్‌యార్డు కమిటీ డైరెక్టర్ తట్టి శ్రీనివాసులురెడ్డి, వైస్ చైర్మన్ జింక వెంకటాచలపతి, కౌన్సిలర్లు పాల్ చంద్రశేఖర్, బి.ఎ.ఖాజా, శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల, శ్యామ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. **పుల్లంపేట :** మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామ సచివాలయ పరిధిలోని సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎంపిపి ముద్దా బాబుల్ రెడ్డి పాల్గొని లబ్దిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందించారు. మాట్లాడుతూ కార్యక్రమంలో సుదర్శన్‌రెడ్డి, రెడ్డి పల్లి సర్పంచ్ ఎల్లయ్య, తహశీల్దార్ నరసింహకుమార్, ఎంపిడిఒ రఘురాం, ప్రకాశం, డిటి ప్రసన్నకుమారి, ఆర్‌ఐ నవీన్, ఎఒ ఖాన్, విఆర్‌ఒ రాధ, సుదర్శన్ రెడ్డి, ఎంపిటిసి ఆలం చెంగయ్య, రెడ్డిపల్లి యువజన యూత్ లీడర్ రొంపిచర్ల లక్ష్మీనారాయణ, రెవెన్యూ సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది, ఆశ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం


బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందిస్తున్న జయచంద్రారెడ్డి

ప్రజాశక్తి-ములకలచెరువు

మండలంలో మురుస కాపులు ప్రమాదవశాత్తు మరణించిన బాధిత కుటుం బాలకు రూ.10వేలు ఆర్థిక సాయాన్ని సోమవారం కుటుంబ సభ్యులకు పారిశ్రామికవేత్త జయచంద్రారెడ్డి అందించారు. మండలంలోని పర్తికోట పంచాయతీ అవలో ళ్ళపల్లి చెందిన బి.విశ్వనాథ్‌రెడ్డి అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకుని ఈ మృతి చెందాడు. ఆశ్రయం కోల్పోయిన ఆ కుటుంబం తో పాటు మద్దినాయనపల్లి పంచాయతీ బిసయ్యగారిపల్లి చెందిన బిపి.శ్రీనివాసులురెడ్డి కరోనాతో మృతి చెందగా ఆ కుటుం బం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొవడవంతో ఆయన భార్య ఒంటరి మహిళ బయ మ్మకు, నాయనవారిపల్లికు చెందిన వెంకటరమణ విద్యుదాఘాతంతో మృతి చెందగా ఆయన భార్య యశోధకు రూ.పది వేలు, గురుకువారిపల్లికు చెందిన రమణ అనారో గ్యంతో మృతి చెందిన కుటుంబానికి రూ ఐదువేలు చొప్పున ఆర్థిక సాయం చేశారు. ఆర్థిక స్తోమత లేక భవిష్యత్తులో ఇబ్బంది పడరాదని ఒక్కలిగరలను బిసిలుగా గుర్తిం చేందుకు సమిష్టిగా పోరాడుదామన్నారు. మొర్సుకాపు రెడ్ల సమస్యల పరిష్కారానికి అందరి సహకారంతో ముందడుగు వేద్దామని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో వేపూరి కోట ఆంజనేయరెడ్డి, మాజీ సర్పంచ్ మస్తాన్ రెడ్డి, సర్పంచ్ కేశవరెడ్డి, తరుగు శివారెడ్డి, కె నరసింహారెడ్డి, బి.కొత్తకోట లోకనాథ్ రెడ్డి, రాయలసీమ రమేష్ రెడ్డిలు పాల్గొన్నారు.

మామిడి మొక్కలు అంటు కట్టడంపై శిక్షణ

ప్రజాశక్తి-కలికిరి

కలికిరి కృషి విజ్ఞాన కేంద్రం ఐసిఎఆర్ 95వ ఫౌండేషన్‌డే సందర్భంగా సోమవారం టెక్నాలజీ వీక్ నిర్వహించారు. మామిడి మొక్కల అంటు కట్టడంపై గ్రామీణ యువతకు శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు కెవికె కో-ఆర్డినేటర్ డాక్టర్ జిఎస్.పాండురంగ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మామిడి మొక్కలు అధికంగా డిమాండ్ ఉందని గ్రామీణ యువత ఈ మామిడి అంటు కట్టడం నేర్చుకోవడం వల్ల మంచి ఉపాధి అవకాశం లభిస్తుందని వివరించారు. తరువాత ఉద్యాన శాఖ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు గ్రామీణ యువతకు మామిడి నర్సరీ మొక్కలు పెంచడం, సయాన్ స్టాక్ ఎంపికా గురించి వివరించి ప్రాక్టికల్ గా చేసి చూపించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కృష్ణారెడ్డి, ఆదర్శ రైతు సహదేవరెడ్డి రైతులు పాల్గొన్నారు.


పొలంబడి కార్యక్రమంలో శిక్షణ ఇస్తున్న మండల వ్యవసాయాధికారి

ప్రతి రైతూ విత్తన శుద్ధి పాటించాలి

ప్రజాశక్తి-గాలివీడు

సాగు చేసే ప్రతి రైతు కూడా విత్తనశుద్ధిని పాటించాలని మండల వ్యవసాయ అధికారి మండెం మురళీధర్ పేర్కొన్నారు. సోమవారం నూలివీడు పొలంబడి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వేరుశనగ పంటలో సాగు ఖర్చు తగ్గించి దిగుబడిని పెంచడమే పొలంబడి యొక్క ముఖ్య ఉద్దేశ్యమన్నారు. రైతులు కూడా విత్తనిశుద్ధి పాటించవలసిన మెలకువలు పాటించాలని సూచించారు. పురుగుమందులు వాడడం వల్ల మానవులలో కరిగే ఆరోగ్య సమస్యల గురించి వివరించారు. కార్యక్రమంలో విఎఎ, విహెచ్‌ఎల్, పకృతి వ్యవసాయ సిబ్బంది, వేరుశనగ సాగుచేసిన రైతులు పాల్గొన్నారు.


అవగాహన కార్యకమంలో మాట్లాడుతున్న సాయివరుణ్

సాంకేతిక నైపుణ్యంపై దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి-కురబలకోట

స్థానిక మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఇఇఇ విభాగానికి చెందిన వారు "కెరీర్ డెవలప్మెంట్ ఐటీ"పై గెస్ట్ లెక్చర్‌ను నిర్వహించినారు. ఈ కార్యక్రమానికి కళాశాల ఇఇఇ విభాగపు పూర్వ విద్యార్థి టీమ్ లీడర్ సాయివరుణ్ పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం ఐటి సెక్టార్‌లో విద్యార్థులు సమాచార, సాంకేతిక నైపుణ్యాలపై దృష్టి సారించాలని సూచించారు. ప్రతి విద్యార్థీ ఒక కంపెనీకి ఇంటర్వ్యూ లకు వెళ్ళేటప్పుడు ముఖ్యంగా అందులో ఎన్ని రౌండ్‌ల ఇంటర్వ్యూ ఉంటుంది, అందులో ఏయే అంశాలపై వారు ప్రశ్నలను అడుగుతారనే దానిపై తెలుసుకోవాలన్నారు. ముఖ్యంగా లేటెస్ట్ టెక్నాలజీ అయిన ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ మొదలైన వాటిపై అవగాహన పెంచుకోవాలన్నారు. మన దేశంలో టెక్నాలజీకి విపరీతమైన డిమాండ్ ఉందని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం లో కళాశాల ఇఇఇ విభాగాధిపతి డాక్టర్ పవన్ కుమార్, అల్యూమిని కో-ఆర్డినేటర్ డాక్టర్ కిరణ్ పాల్గొన్నారు.

అంగన్వాడీ భవనాలకు నిధులు మంజూరు చేయండి


ఆగిన అంగన్వాడీ భవన నిర్మాణం

ప్రజాశక్తి-సుండుపల్లె

మండలంలోని చిన్న పిల్లల అభివృద్ధి కోసం నాడు-నేడు పథకంలో భాగంగా నిర్మిస్తున్న భవనాలకు నిధులు మంజూరు చేయాలని సోమవారం అంగన్వాడీ కార్యకర్తలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాదాపుగా రెండు నెలల నుంచి నిధులు రాక భవన నిర్మాణాలు ఆగిపోయాయని అన్నారు. గతంలో వచ్చిన నిధులతో కొన్ని భవనాలు గోడల వరకు పూర్తయ్యాయని, మరికొన్ని భవనాలు ఏడు అడుగుల మేరకే నిలిచి పోయాయని తెలిపారు. ప్రభుత్వం పూర్తిగా నిధులను విడుదల చేస్తే అంగన్వాడీ భవన నిర్మాణాలు పూర్తవుతాయని అన్నారు. భవన నిర్మాణాలు పూర్తయితే పిల్లలకు, గర్భిణులు, బాలింతలు సంతృప్తి స్థాయిలో సేవలు అందించేందుకు వీలుంటుదని తెలిపారు.


నీటి శీతలీకరణ యంత్రాలు అందిస్తున్న జడ్‌పి చైర్మన్ అకేపాటి అమరనాథరెడ్డి

నీటి శీతలీకరణ యంత్రాలు వితరణ

ప్రజాశక్తి-రాజంపేట రూరల్

జవాద్ తుఫాన్ సమయంలో ముంపుకు గురైన ఏకిరిపల్లి, పులపుత్తూరు, తొగురుపేట, మందపల్లి, గుండ్లూరు గ్రామాలకు సోమవారం జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమమనాథరెడ్డి చేతుల మీదుగా నీటి శీతలీకరణ యంత్రాలను వితరణ చేశారు. ఎపిఎన్‌ఆర్‌టిఎస్ కువైట్ వారి సహకారంతో జడ్‌పి చైర్మన్ సోమవారం 150 లీటర్ల సామర్థ్యం కలిగిన రూ.5లక్షల నలభై వేలు విలువ చేసే ఆరు యంత్రాలను ఆయా గ్రామాలకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసానిచ్చారు. వరద బాధిత గ్రామాల్లో మౌళిక వసతుల కల్పనను వేగవంతం చేశామన్నారు. ప్రతిపక్షాలు లేని పోని రాద్ధాంతం చేస్తున్నాయని అన్నారు. నష్ట పోయిన గ్రామాలను పునరుద్ధరించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో పులపుత్తూరు సర్పంచ్ జగన్, భీము సుబ్బారెడ్డి, బాలకృష్ణ, వైసిపి కువైట్ ప్రతినిధులు మహేష్‌రెడ్డి, బిహెచ్ ఇలియాస్, వెంకటసుబ్బారెడ్డి, గంగిరెడ్డి, సురేష్‌రెడ్డి, హనుమంతురెడ్డి, పార్టీ నాయకులు పోలి మురళిరెడ్డి, మధుయాదవ్, పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా సిద్ధం చేయాలి

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

తప్పులు లేకుండా ఓటర్ల జాబితాని సిద్ధం చేసేందుకు బిఎల్‌ఒలు, విఆర్‌ఒలు కృషి చేయాలని తహశీల్దార్ శ్రీనివాసులు కోరారు. సోమవారం ఎంపిడిఒ బిఎల్‌ఒల తో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ఈనెల 21వ తేదీ నుంచి నెల రోజుల పాటు బిఎల్‌ఒలు, విఆర్‌ఒల పర్యవేక్షణలో ఇంటింటా సర్వే స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహించాలన్నారు. ప్రతి ఇంటిలోని ఓటర్లు వారి వివ రాలు, మృతి చెందిన వారి వివరాలు జాబితాలో చేర్చాల్సిన యువత వివరాలు, వలస వెళ్లిన వారి వివరాలు సేకరించాలన్నారు. విధి నిర్వ హణలో ఎవరు నిర్లక్ష్యం చేసిన చర్యలు తప్పవన్నారు. ఇంటింటికి వెళ్లి సమగ్ర సర్వేను పూర్తి చేసి పక్కాగా ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. ఈ స్పెషల్ క్యాంపెయిన్ ను పూర్తి చేసి అనుకున్న లక్ష్యాలను సాధించాలన్నారు.

ఘనంగా శ్రీచౌడేశ్వరి జయంతి వేడుకలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

స్థానిక నీరుగట్టువారిపల్లెలో శ్రీచౌడేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలు భక్త జనసంద్రం మధ్య కన్నుల పండువగా నిర్వహించారు. సోమవారం శ్రీచౌడేశ్వరిదేవి ఆలయ కమిటీ అధ్యక్షులు ఉప్పు రామచంద్ర ఆధ్వర్యంలో శ్రీచౌడేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలను ఆలయ కమిటీ,ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించింది. అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, పంచా మృతాభిషేకం శ్రీకృష్ణ ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం, రక్తదాన శిబిరం, మధ్యాహ్నం భక్తులకు పెద్దఎత్తున అన్నదానం, సాయంత్రం అమ్మవారి ఊరేగింపు అత్యంత వైభవంగా ప్రారంభం కొన సాగాయి. ఉదయం నుంచి అమ్మవారి దర్శనం కోసం ఆలయానికి భక్తులు పోటెత్తారు. అమ్మవారి జయంతి వేడుకలు జయప్రదం చేయడంలో తొగట వీర క్షత్రియ యువజన సంఘం, శ్రీచౌడేశ్వరి దేవి యువజన సేవా ట్రస్టుల సంయుక్తంగా సేవలు అందించారు. ఆల యానికి పెద్ద ఎత్తున పట్టణ ప్రజలు, భక్తులు తరలివచ్చి అమ్మవారికి కృపకు పాత్రులై తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం మాయాబజార్, చౌడేశ్వరి నగర్ మీదుగా అమ్మవారి ఊరేగింపు అత్యంత వైభవంగా జరిగింది. కార్యక్రమంలో అధ్యక్షులు ఉప్పు రామచంద్ర,గౌరవ అధ్యక్షులు మోడెం వెంకటరమణ,గౌరవ ఉపాధ్యక్షులు శ్రీరామ్ చినబాబు,నీలకంఠ, మోడెం సిద్దప్ప, బండి నాగరాజు, కెవి.నాగరాజు, కార్యదర్శి జి.ప్రభాకర్, కోశాధికారి రామిశెట్టి లోకేష్, భక్తులు పాల్గొన్నారు. **తంబళ్లపల్లె :** మండ లంలోని బురుజులో వెలసిన శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మవారి ఆలయంలో సోమ వారం అమ్మవారు జయంతి ఉత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. దయ్యాల వారి దాయాదులు తొగట వీర క్షత్రియులు ఇలవేల్పు శ్రీచౌడేశ్వరి దేవి అమ్మవారికి భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలతో మొక్కులు తీర్చుకున్నారు. దాతల సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు. భక్తులు పెద్ద ఎత్తున వేడుకల్లో పాల్గొన్నారు.


మదనపల్లి : రక్తదానం చేస్తున్న కమిటీ నిర్వాహకులు


నర్సరీ నిర్వాహకునికి నోటీసు అందిస్తున్న ఉద్యానవనశాఖ అధికారి నాగవేణి

నర్సరీ నిర్వాహకులు నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి-రామాపురం

మండలంలో ఏర్పాటు చేసిన పలు షెడ్‌నెట్ నర్సరీలను లక్కిరెడ్డిపల్లె ఉద్యాన వన శాఖాధికారి నాగవేణి సోమవారం మండలంలోని నర్సరీ లను పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేసి నోటీసులు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాణ్యమైన విత్తనాలను మాత్రమే ఉపయోగించాలని, రిజిస్టర్లు నిర్వహించాలని సూచించారు. మొక్కల విక్రయించే సమయంలో విత్తనం తాలూకు పూర్తి సమాచారంతో రశీదులను అందించాలన్నారు. నర్సరీ లైసెన్స్ నెంబరు ప్రింట్ అయిన బిల్లు మాత్రమే రైతులకు ఇవ్వాలన్నారు. నర్సరీ లోపల పసుపు నీలపు రంగు జిగురు అట్టలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రతి బెడ్డుకు ముందు ఆ బెడ్డులో పోసిన నారును సూచిస్తూ కంపెనీ, వెరైటీ నాటిన తేదీ వివరాలు గల బోర్డును ఏర్పాటు చేయాలని తెలిపారు. క్రొత్తగా ఏర్పాటు చేసిన నర్సరీ నిర్వాహకులు తప్పనిసరిగా లైసెన్స్‌కు దరఖాస్తు చేసుకోని లైసెన్స్ పొందాలన్నారు. నర్సరీల పేరు కనిపించేలా ప్రత్యేక సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. నర్సరీ లోపల వైరస్ నిర్మూలనకు చుట్టూరా ట్రాప్- క్రాప్ బంతి మొక్కలు వేయాలన్నారు. నర్సరీలో కలుపు మొక్కలు లేకుండా చూసుకోవాలని వివరించారు. నిబంధనలు పాటించని నర్సరీ నిర్వాహకులపై తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో రైతు భరోసా కేంద్ర సిబ్బంది ప్రవీణ్, చంద్రకళ పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

ప్రజాశక్తి-పుల్లంపేట


వీధి దీపాలను పరిశీలిస్తున్న సర్పంచ్

మౌలిక వసతుల కల్పనే తన లక్ష్యమని పుల్లంపేట సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులురెడ్డి అన్నారు. సోమవారం పుల్లంపేట గ్రామపం చాయతీలో వీధిలైట్లు మరమ్మతులు చేపట్టారు. మరమ్మతులతో పాటు ప్రతి వీధిలో కొత్త వీధి దీపాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ విధులలో విద్యుద్దీపాల సమస్య తన దృష్టికి రావడంతో వెంటనే మరమ్మత్తులతో పాటు కొత్త లైట్లు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. వీధిలైట్లు లేకపోవడం వలన ప్రజలు విషపురుగుల బారిన పడటంతో పాటు దొంగలు బెడద కూడా ఉంటుందని అన్నారు. గ్రామపంచాయతీలో ఎటువంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీనిచ్చారు. ప్రజలకు మౌలిక వసతులు కల్పించి పంచాయితీని అభివృద్ధి బాటలో నడిపించేందుకు అన్ని విధాల కృషి చేస్తానని స్పష్టం చేశారు.

హక్కుల సాధనకు ఉద్యమిద్దాం

ప్రజాశక్తి-కలికిరి

కారంచేడు అమరుల సంస్మరణ దినం సంద ర్భంగా పట్టణంలో అంబేద్కర్ విగ్రహానికి భారతీయ అంబేద్కర్ సేన నాయ కులు పూలమాలు వేసి కారంచేడు అమరవీరులకు ఘనమైన నివాళులు అర్పిం చారు. అనంతరం అంబద్కర్ విగ్రహం నందు నిర సన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బాస్ జిల్లా కో-కన్వీనర్ పాలకుంట శ్రీని వాసులు మాట్లాడుతూ 1985 జులై 17న కారంచేల్లో అహంకారంతో నిండిన అగ్ర భూస్వాములు దళితవాడను నెత్తుటి కుప్పగా మలిచి మరణకాండకు నేటితో 38 ఏళ్లు గడిచాయని అన్నారు. ఈ దారుణకాండ కు వ్యతిరేకంగా దళితులలో ప్రతిఘటనలు దేశవ్యాప్తంగా దళితులలో, ప్రజాస్వామ్య శక్తులలో గొప్ప చైతన్యాన్ని కలిగించిందని ఈ ఉద్యమం దళిత పోరాట చైతన్యానికి ప్రతీకగా మారిందన్నారు. కారంచేడు ఉద్యమం జాతీయ స్థాయి దళిత ఉద్యమానికి నాందీ పలికి ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార నిర్మూలన చట్టం తెచ్చిందని వీరు తెలిపారు. అగ్రకుల మనువాద పాలకుల పాలనలో కోల్పోతున్న హక్కుల కోసం కారంచేడు ఉద్యమస్ఫూర్తితో దళితులు ఆత్మగౌరవ ప్రతిఘటన పోరాటాలను నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో భారతీయ అంబోద్కర్‌సేన నాయకులు వంగిమళ్ళ గురునాథ, కటారి గంగాధర్, నగిరిమడుగు సుబ్బరాయుడు, బంగి ఈశ్వరయ్య, ఆబిద్, గంగాధర్, చంద్రయ్య పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** కారంచేడు కులని ర్మూలన అమర వీరుల స్మారక దినం సందర్భంగా సోమవారం స్థానిక బెంగళూరు రోడ్డులో అంబేద్కర్ విగ్రహం వద్ద విసికె పార్టీ ఆధ్వర్యంలో కారంచేడు వీరులకు వీరవందనం కార్యక్రమం నిర్వహించారు.అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. కులనిర్ములన సమరంలో నేలకొరిగిన కారంచేడు-చుండూరు యుద్ధవీరులకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఇఒ ప్రజాకవి పోతబోలు రెడ్డెప్ప, రిటైర్డ్ డిప్యూటీ జైలర్ బురుజు లక్ష్మీనారాయణ, నాయకులు గిన్నెల మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.



కలికిరి : ర్యాలీ నిర్వహిస్తున్న బాస్ నాయకులు

క్రైం కార్నర్

రైతు దారుణ హత్య

ప్రజాశక్తి-బి.కొత్తకోట


మృతి చెందిన రైతు మధుకర్‌రెడ్డి

ఓ రైతు దారుణ హత్యకు గురైన సంఘటన తంబళ్లపల్లె నియోజ కవర్గం, పిటియం మండలం నవాబు కోటలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న డిఎస్‌పి కె.కేశప్ప, పోలీస్ సిబ్బంది సోమవారం ఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ నవాబు కోటకు చెందిన మధుకర్‌రెడ్డి (33) అనే రైతు తన వ్యవసాయ పొలం వద్ద నిద్రిస్తుండగా హత్య చేసి నిందితులు పరారయ్యారని అన్నారు. హత్యకు గల కారణాలును క్లూస్ టీం, పోలీసు జాగిలాలు ద్వారా పరిశీలిస్తున్నామని తెలిపారు. మృతుడు తండ్రి శివరామిరెడ్డి తమ గ్రామానికి చెందిన పలువురిపై అనుమానం వ్యక్తం చేస్తున్నారని, ఆయన ఫిర్యాదు మేరకు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి హత్యకు కారకులైన నిందితులను త్వరలోనే అదుపులోకి తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కేసును సిఐ సాధిక్‌అలీ విచారణ చేస్తారని వెల్లడించారు. మధు కర్‌రెడ్డి హత్యతో నవాబుకోటలో విషాదఛాయలు అమ్ముకున్నాయి.

అదుపుతప్పి ఆటో బోల్తా : ఒకరికి గాయాలు

ప్రజాశక్తి-రామాపురం

మండల పరిధిలోని గంగనేరు క్రాస్ సమీపంలో సోమవారం ఆటో అదుపుతప్పి బోల్తా పడడంతో సాయి అనే యువకుడికి తీవ్ర గాయాలు అయ్యాయి. పోలీసుల వివరాల మేరకు..మండలంలోని సరస్వతిపల్లె పంచాయతీ ఉడుము వారిపల్లెకు చెందిన సాయి రాయచోటికి ఆటోలో బయలుదేరినట్లు తెలిపారు. ఆటో డ్రైవర్ మద్యం సేవించి డ్రైవింగ్ చేయడంతో గంగనేరుక్రాస్ సమీపంలో అదుపుతప్పి ఆటో బోల్తా పడడంతో ఆటోలో ఉన్న సాయి కి తీవ్ర గాయాలు అయినట్లు తెలిపారు. గాయపడిన వ్యక్తిని పోలీసులు 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.